క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై అవగాహన



వై.రామవరంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న డీటీ సుధాకరరావు

వై.రామవరం: రానున్న ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీయంలు) వినియోగంపై స్థానిక పోలింగు బూత్‌ల వద్ద ఓటర్లకు డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు శుక్రవారం అవగాహన కల్పించారు.ఈవీఎంలో ఓట్లు వేసే విధానాన్ని వివరించారు. ఓటర్లతో ప్రాక్టికల్‌గా ఈవీఎంలో ఓట్లు వేయించారు. సీనియర్ అసిస్టెంట్ తాతారెడ్డి, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, బీఎల్‌వోలు, ఓటర్లు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనుల పరిశీలన



రోగులపేటలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ మాధవరావు

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని సర్పంచ్ పలాసి మాధవరావు అన్నారు. పంచాయతీలోని రోగులపేట, కిత్తుకొండ గ్రామాల్లో రూ.13 లక్షల నిధులతో నిర్మిస్తున్న తాగునీటి పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకం, పైపులైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటున్నట్టు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తహసీల్దార్‌గా అప్పారావు బాధ్యతల స్వీకరణ

జి.మాడుగుల: మండల తహసీల్దార్‌గా ఎస్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా భామిని నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పలస్వామి ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది విధుల్లో చేరిన తహసీల్దార్ అప్పారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేటి నుంచి మహాధ్యానచక్ర

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీ పూతికవలస ప్రకృతి వ్యాలీలో శనివారం నుంచి 11 తేదీ వరకు మహాధ్యానచక్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు దాట్ల రాయజగపతిరాజు శుక్రవారం తెలిపారు. మన్యసీమను ధ్యానసీమగా మార్చేందుకు పత్రీజీ కలలుగన్నారని, దీన్ని నేరవేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ధ్యానం అంటే శ్వాసమీద ధ్యాస అని తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా సంగీతం, ధ్యానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఎథిక్స్ పరీక్షకు 296 మంది హాజరు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొత్తం 296 మంది ఫస్ట్ ఇంటర్ విద్యార్థులు శుక్రవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ రైట్స్ పరీక్ష రాశారు. గురుకుల కళాశాలలో 133 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 163 మంది ఈ పరీక్ష రాసినట్టు ప్రిన్సిపాళ్లు సలోమి, ఆర్.శిరీష చెప్పారు.

70 మందికి కంటి పరీక్షలు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము పెంతుకోస్తు ఆలయంలో జీసస్ మినిస్ట్రీస్, విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వై. అమృత్‌లాల్ రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స అందజేశారు. శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు చేశామని, ఇందులో 15 మందిని కాటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం తరలిస్తున్నట్టు నిర్వాహకులు పాస్టర్ కోట సల్మాన్‌రాజు, డాక్టర్ విజయబాబు తెలిపారు.



బడదనాంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష



కిముడుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు



కొత్తభల్లుగుడలో కిట్లు అందజేస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షురాలు రాధిక

అరకులోయ రూరల్: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షురాలు కొర్రా రాధిక అన్నారు. మండలంలోని కొత్తభల్లుగుడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో సుమారు 230 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసి, జగనన్న ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష కలుగుతోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వం పార్టీలకతీతంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందజేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. వైద్యులు పావని, గీతాంజలి, ఉపేంద్ర, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైస్ సర్పంచ్ ఏలేష్, వార్డు సభ్యులు, సచివాలయం, ఉద్యోగులు ,గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెదబయలు: ప్రతీ ఒక్కరూ సంపూర్ణం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ రామకృష్ణ అన్నారు.మండలంలోని మారుమూల కిముడుపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారులు శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ సచివాలయం పరిధిలోని 243 మందికి పరీక్షలు చేశామన్నారు. 28 మంది గర్భిణులకు పరిక్షలు నిర్వహించామన్నారు.గర్భిణులు తప్పనిసరిగా డెలివరీ తేదికి 10 రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేరాలని, అక్కడున్న బర్త్ వెయిటింగ్ హాల్‌లో అన్ని సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఆస్పత్రిలో కాన్పు అయిన తరువాత ప్రభుత్వం వారి పారితోషకం అందించి ఇంటి వరకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లో దింపడం జరుగుతుందని అవగాహన కల్పించారు. హైరిస్క్ కేసులను తక్షణమే మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రులకు తరలిస్తామన్నారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. శిబిరంలో రెండు కేసులకు వివిధ శస్త్రచికిత్సల నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌లకు సిఫార్సు చేశామన్నారు.శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్టు చెప్పారు. ప్రభుత్వం ప్రతీ ఇంటికి ప్రతీ ఒక్కరికి వైద్యం అందించడంతో పాటుగా మన ఇంటి వద్దకే వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తోందని ఇందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. క్షయకు సంబంధించి టీబీ యూనిట్ ద్వారా 12 మందికి కల్లె పరీక్షలు చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 48 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్లు స్నేహరెడ్డి, నిఖిల్, వైద్య సిబ్బంది సింహాచలం, వైద్య సిబ్బంది. ఆశా కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొండిగెడ్డలో గిరిజనులకు ఆరోగ్య సురక్ష కార్డులను అందజేస్తున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గిరిజనులకు వరమని గూడెం కొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మొండిగెడ్డ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ అడపా ప్రియాంక, ఉప సర్పంచ్ బొంజుబాబు, కార్యదర్శి రాజ్యలక్ష్మి, వైద్యులు, సచివాలయ సిబ్బంది వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీలోని అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, లక్కవరప్పాడు, రాజుపేట, చినరెల్లంగిపాడు గ్రామాల నుంచి ఆదివాసీలు ఈ శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు. ఈ శిబిరంలో 165 మందికి చికిత్స లభించింది. 55 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ఎంపీడీవో ఎం.వి.రామారావు, పిడియాట్రీషియన్ డాక్టర్ అనిల్, రాజవొమ్మంగి, జడ్డంగి పీహెచ్‌సీల వైద్యాధికారులు నాగార్జున, డాక్టర్ నాగరాజు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్.ప్రసాద్, హెచ్‌వీ రమాబాయి, ఎల్టీ వెంకటలక్ష్మి, ఫార్మసిస్ట్ రాజి, ఆశ, ఏఎన్ఎం తదితర వైద్య సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అరుకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ కేంద్రంలోని నూతంగా నిర్మించిన సచివాలయ కేంద్రాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు పాంగి బేసు, సాంభ, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు, భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లి పంచాయతీ లంకవీధి గ్రామంలో ఇటీవల కూడా వెంకటరమణ అనే గిరిజనుడు అనారోగ్యంతో మరణించారు. ఇతనికి వైఎస్సార్ బీమా కింద దహన సంస్కారాల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ రామకృష్ణ శుక్రవారం అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ సహాయకుడు పాత్రుడు, వలంటీర్లు విజయకుమారి, నాయకులు మోహన్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ తదితరులు

ఉచిత గ్యాస్ కనెక్షన్ పంపిణీ

రంపచోడవరం: పీఎం ఉజ్వల యోజన పథకం కింద రంపచోడవరం మండలంలో 50 మంది లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు మంజూరైనట్టు ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద శుక్రవారం లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు అందజేశారు. ఏఓ డీఎస్‌పీ రమణ, నేపా చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేస్తున్న ఏపీవో శ్రీనివాసరావు, ఏవో రమణ

కనులపండువగా అమ్మవారి తీర్థ మహోత్సవం



సారె ఊరేగింపులో భక్తులు

సాక్షి,పాడేరు: గుడివాడ వీధిలో శంకులమ్మ తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు సారెను ఊరేగించారు. అమ్మవారికి పూజలు చేశారు. శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



సికిల్‌సెల్ ఎనిమియా బాధిత చిన్నారికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: సికిల్‌సెల్ ఎనిమియా బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తుందని సర్పంచ్ ఎస్.నరసింగరావు అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలో శుక్రవారం సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్న చిన్నారి ఎం.భువనేశ్వరికు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల పింఛన్‌ను సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ అందజేశారు వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సికిల్‌సెల్ ఎనిమియా బాధితులకు పింఛన్ మంజూరు చేస్తూ వారికి ఆర్థికంగా జగనన్న ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు సకాలంలో వైద్యం అందించడం హర్షణీయమన్నారు. లవరాజు, అనంత ,కృష్ణ, శాంతమ్మ పాల్గొన్నారు.

గృహాల మంజూరుకు వినతి

అనంతగిరి: మండలంలోని నాన్ షెడ్యూల్డ్ భీంపోల్ పంచాయతీ బి.కొత్తవలస, నందకోట, లువ్వా గ్రామాల్లో పీవీటీజీలకు ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు అశోక్ కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు ఇళ్లు మంజూరు చేస్తుందని, ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి, 38 కుటుంబాలను అర్హులుగా గుర్తించిందన్నారు. అయినప్పటికీ వారికి ఇళ్లు మంజూరు కాలేదన్నారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

1104 నూతన కమిటీ ఎన్నిక

మోతుగూడెం: మోతుగూడెం 1104 యూనియన్ బ్రాంచ్ కమిటీ ఎన్నికలు ప్రతినిధులు సత్తి బాబు , కిరణ్‌ల అధ్యక్షతన జరిగాయి. కమిటీ అధ్యక్షుడిగా గురులోత్ రవి, బ్రాంచ్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సెల్వరాజ్, కోశాధికారిగా గోవింద్‌రాజ్‌లు ఎన్నికయ్యారు. కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయండి



మండల పార్టీ ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న నేతలు

దేవీపట్నం: దెందులూరులో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి భారీగా పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు అన్నారు. దేవీపట్నం మండలం ముసుల్లకుంట జెడ్పీటీసీ సభ్యురాలు సిరసం సత్యవేణి స్వగృహంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దెందులూరు సభకు వెళ్లేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అలాగే ఈ నెల 9న మండలంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు నిర్వహించే రోడ్‌షో గురించి నాయకులతో చర్చించారు. మండల పార్టీ ఉపాధ్యక్షులుగా నియమితులైన కర్రి అబ్బాయిరెడ్డి, కొమరం బాలకృష్ణలను సన్మానించారు.ఎంపీపీ కుంజం మురళీ, సచివాలయ మండల కన్వీనర్ కందుల బాబ్జి, సత్యనారాయణ, వైస్‌ఎంపీపీ గారపాటి మురళీ, పెద్దబ్బి,ఎంపీటీసీలు, సర్పంచ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: కోనాం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలాన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న పాఠశాలలో ఉంటుందన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై కేసు

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల్ని స్థానికులు పట్టుకున్నారు. పశువులను దొంగిలించే వారని భావించి ఇద్దరినీ తాళ్లతో కట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్

అరకులోయ రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ చెప్పారు. మండలంలో చినలబుడు పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానిక నాయకులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం చేశారు, చినలబుడు గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించి, గ్రామస్తులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై పార్టీ శ్రేణులంతా విస్తృతంగా ప్రచారం చేసి, అందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయవంతం కోసం నాయకులంతా సమష్టి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఎంఈవో సూరయ్యరెడ్డి

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షకు 439 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు ఎంఈవో టి.సూరయ్యరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 99 మంది, లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 21 మంది, జడ్డంగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 30 మంది, స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 43 మంది, స్థానిక గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 15 మంది, బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 61 మంది, జడ్డంగిలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 30 మంది, సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 31 మంది, అమీనాబాద్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నుంచి 20 మంది, స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నుంచి 82 మంది ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఇప్పటికే సిలబస్ పూర్తికాగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, రాజవొమ్మంగి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలు కేంద్రంగా మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

తహసీల్దార్లకు ఘన సన్మానం



తహసీల్దార్ తిరుమలరావును సన్మానిస్తున్న ఎంపీడీవో, జెడ్పీటీసీ, ఏటీడబ్ల్యూవో తదితరులు

కొయ్యూరు: మండలం నుంచి సంతకవిటికి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సీహెచ్.తిరుమలరావును సిబ్బంది, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు చేసిన సేవలను పలువురు కొనియాడి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు మాట్లాడుతూ అనేక భూ సమస్యలను తహసీల్దార్ పరిష్కరించారన్నారు. గిరిజనులకు పోడు భూముల పట్టాల కోసం విశేష కృషి చేశారన్నారు. ఎంపీడీవో లాలం సీతయ్య, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ మాట్లాడుతూ తహసీల్దార్ తిరుమలరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీత తహసీల్దార్ తిరుమలరావు మాట్లాడుతూ పోడు భూముల పట్టాల పంపిణీలో కొయ్యూరును జిల్లాలో మొదటి స్థానంలో ఉంచామన్నారు. భూముల రీసర్వేలో కొయ్యూరు మండలం ముందువరసలో ఉందన్నారు. అల్లూరి నడయాడిన ప్రాంతంలో విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. డీటీ సీతారామ్, రీ సర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, రాజేంద్రపాలెం, చిట్టింపాడు, సర్పంచ్‌లు పి.సింహాచలం, ఎస్.నూకాలమ్మ, ఆర్ఐ రాజన్న దొర, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ పురంలో తహసీల్దార్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వీఆర్ పురం: బదిలీపై వెళుతున్న తహసీల్దార్ ఎన్.శ్రీధర్‌ను రేఖపల్లి ఏఎస్‌డీఎస్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోల కార్యక్రమంలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం చాలా ఆనందం కలిగించిందని చిరస్థాయిగా గుర్తించుకుంటానన్నారు. 2022 వరదల సమయంలో ఇక్కడి ప్రజలకు సేవలందించడం చాలా సంతృప్తి నిచ్చిందన్నారు. ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, జీసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, వివిధ పార్టీల నాయకులు సంస్థ కో-ఆర్డినేటర్లు సుబ్రహ్మణ్యం, మీనా, హరిబాబు సిబ్బంది రవి, నాగమణి, పూజిత, జ్యోతి, కన్నారావు, ముత్యాలరావు, సౌజన్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే ఉత్తమ ఫలితాలు



ఎంఈవో కృష్ణమూర్తిని సన్మానిస్తున్న హెచ్ఎంలు, యూటీఎఫ్ నాయకులు

పెదబయలు: ప్రతీ ఒక్కరూ తమ విధులు నిబద్ధతతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు, మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి అన్నారు. ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ ఎంఈవోగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కృష్ణమూర్తిని ఉపాధ్యాయులు, తదితరులు శాలువా కప్పి ఘనగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి పని చేయడం వల్లే మండలానికి మంచి గుర్తింపు, అవార్డు వచ్చిందన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ ఉపాధ్యాయుడు వృత్తిని దైవంగా భావించి పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తోందన్నారు. మన విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీపడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అందరం కలిసి పని చేస్తే మరింత మంచి ఫలితాలు సాధించవచ్చని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు స్వామి, మండల యూటీఎఫ్ నాయకులు సత్యనారాయణ, మాధవరావు, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



రైతుతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు పండిస్తున్న పసుపునకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలో గల జర్జుల పంచాయతీ బల్దా గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. రైతులతో మాట్లాడి పసుపు ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపునకు గిట్టుబాటు ధర కల్పించాలని ,రాయితీపై రుణాలు, ఉచితంగా విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సీపీఎం నేత శ్రీను తదితరులు పాల్గొన్నారు.